క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్‌ : బాధిత కుటుంబాన్ని కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి పరామర్శించారు. కడప నగరం 39వ డివిజన్‌ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి షేక్‌ కమల్‌ బాషా మృతదేహాన్ని ఆదివారం ఎంపీ సందర్శించారు. మోచంపేటలోని మృతుడి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వ్యవసాయ శాఖ మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ మేయర్‌ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్‌ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ బధిర విద్యార్థుల సమ్మేళనం



హెలన్‌ కెల్లర్‌ కరస్పాండెంట్‌ దంపతులను సన్మానిస్తున్న బధిర విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్‌ : కడప నగర శివారులోని హెలన్‌ కెల్లర్‌ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్‌, డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1984 నుంచి ఇప్పటి వరకు చదివిన చెవిటి, మూగ విద్యార్థులు కలుసుకుని ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ హెలన్‌ కెల్లర్‌లో చదువుకున్న వారిలో 70 మంది ప్రభుత్వ ఉద్యోగాలు, 250 మంది పలు ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలను పొందారని హెలన్‌ కెల్లర్‌ సంస్థ జనరల్‌ సెక్రటరీ కమ్‌ కరస్పాండెంట్‌ దౌలత్‌ఖాన్‌ తెలిపారు. వీరందరు కలిసి కరస్పాండెంట్‌ దౌలత్‌ఖాన్‌, ప్రిన్సిపాల్‌ మసుదబేగంలను ఘనంగా సన్మానించారు.

'మేము సైతం' ఆధ్వర్యంలో అంత్యక్రియలు



శ్మశాన వాటికలో మృతదేహానికి పూజలు చేస్తున్న మేము సైతం సేవా సంస్థ సభ్యులు

కడప అర్బన్‌ : కడప నగరంలోని బిల్టప్‌ సమీపంలో ఓ హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్న ఓబులేసు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి అంత్యక్రియలను చేసేందుకు ఎవరూ లేకపోవడంతో హోటల్‌ యజమాని, తాలూకా పోలీస్‌స్టేషన్‌ వారి సిఫారసు మేరకు మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో ఓబులేసు అనే వ్యక్తి మృతదేహానికి అంత్యక్రియలను ఆదివారం హిందూ సంప్రదాయ పద్ధతిలో పూజలను నిర్వహించి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.అయ్యవారయ్య, రామలోకం, నరసింహ, గురువయ్య, నాగేశ్వరయ్య, పుల్లయ్య, రామరాజు, షామియానా సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్‌ మహబూబ్‌ అలీ

కడప ఎడ్యుకేషన్‌ : కడపలోని మెడికేర్‌ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత యోగా వైద్య శిబిరం విజయవంతం అయింది. డాక్టర్‌ మహబూబ్‌ అలీ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మూడు వేల విలువ చేసే షుగర్‌, కొలెస్ట్రాల్‌, ఈసీజీ, హెచ్‌బీఏఎల్‌సీ, న్యూరోపతి పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ మహబూబ్‌ అలీ మాట్లాడుతూ షుగర్‌ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య శిబిరంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకొమ్మదిన్నె సుబ్బరాయుడు, ఆసుపత్రి సిబ్బంది సయిద్‌ నూర్‌, షాహిద్‌ పఠాన్‌, గౌతమి, అయేషా, భార్గవి, వైష్ణవి, శిరీష రెడ్డి, సబిహా, మాధవి, మహిత, సువర్ణలతోపాటు మెడికల్‌ రెప్‌లు పాల్గొన్నారు.

పరిశ్రమలలో కార్మికులకు భద్రత కల్పించాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : పరిశ్రమలలో కార్మికులకు భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్‌ సెక్రటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమిన్‌ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మాలో జరిగిన దుర్ఘటనను చూసైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి ప్రతి జిల్లాలో కలెక్టర్‌ అధ్యక్షతన ఫ్యాక్టరీస్‌ ఇన్‌స్పెక్టర్‌, కార్మిక, పరిశ్రమల శాఖల అధికారులు, పరిశ్రమల యాజమాన్యాల సమక్షంలో ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేందుకు సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.లింగన్న పాల్గొన్నారు.

ఆసుపత్రుల వద్ద భద్రత కల్పించాలి



కలకత్తాలోని ఆర్‌జీ కర్‌ వైద్య ఆసుపత్రి లో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య మరువక ముందే తిరుపతిలోని స్విమ్స్‌ ఆసుపత్రిలో వైద్యురాలిపై దాడి చేయడం దారుణం. ఆసుపత్రుల వద్ద పోలీస్‌ సిబ్బందితో భద్రత కల్పించాలి. అసలు రోగులు వైద్య సేవలు పొందడానికి ఆసుపత్రులకు వస్తున్నారా? లేక వైద్యులపై దాడులు చేయడానికి వస్తున్నారా? అర్థం కావడం లేదు. – అరుణ, ఏఎన్‌ఎం, 3వ సచివాలయం, కమలాపురం



అప్రమత్తంగా ఉండాలి



మహిళా వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది భద్రత విషయంలో పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఆ మీటింగ్‌లో మా దృష్టికి వస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. విద్యార్థులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఆస్పత్రిలో పని చేసేటపుడు జాగ్రత్తగా, మెలకువగా ఉంటూ విధులు నిర్వర్తించాలి.

– శైలారేఖ, ప్రిన్సిపాల్‌, ఫాతిమా వైద్య కళాశాల, కడప

భద్రత ప్రమాణాలు పెంచుకోవాలి



వైద్య విద్యార్థులైనా, డాక్టర్లెనా ఎవరైనా సరే తమ వ్యక్తిగత భద్రత ప్రమాణాలను పెంపొందించుకోవాలి. ఇందుకు ప్రత్యేకంగా శిక్షణను తీసుకోవాలి. నేరాలకు పాల్పడే అవకాశం వున్న వెంటనే మూకుమ్మడి వచ్చి ఎదుర్కొనేలా అందరూ ఒకరినొకరు సహకరించుకోవాలి. – డాక్టర్‌ జ్యోత్స్న, ప్రిన్సిపాల్‌, ప్రభుత్వ దంతవైద్య కళాశాల, రిమ్స్‌ ఆవరణం, కడప

పడకేసిన పారిశుధ్యం



వై-జంక్షన్‌ వద్ద కాలువలో పేరుకుపోయిన పూడిక

కడప నగరంలోని పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రధాన కూడళ్లలో సైతం చెత్త పేరుకుపోతోంది. జనావాసాల మధ్య చెత్తకుప్పలు నిండుగా దర్శనమిస్తున్నాయి. అలాగే నగరం మధ్యలో వెళ్లే బుగ్గవంకలో జంబు పెరిగి వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యలోపం వల్ల జ్వరాలు, వ్యాధులు ప్రబలుతున్నాయని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, కడప



నగర పరిధిలోని పక్కీరుపల్లెలో ప్రధాన రహదారిపై..



అమ్మవారిశాల వీధిలో...



వై-జంక్షన్‌ వద్ద డ్రైనేజీ కాలువలో పేరుకున్న పూడిక



వైవీ స్ట్రీట్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద చెత్తాచెదారాలు

ఉప్పు నీటి నుంచి విముక్తి



మరమతుల కోసం తీసిన గుంత



పైపులైన్‌కు చేస్తున్న మరమ్మతులు

- మున్సిపల్‌ వాటర్‌ వచ్చినప్పుడు గంటపాటు విడుదల
- విద్యుత్‌నగర్‌ వాసుల అభినందనలు

సాక్షి ఎఫెక్ట్‌..

కడప ఎడ్యుకేషన్‌ : కడప నగరం చిన్నచౌక్‌ పంచాయతీ పరిధి 6వ వార్డు–1లోని విద్యుత్‌నగర్‌ (రోడ్డు నెంబర్‌–3,4,5) వాసులకు మున్సిపల్‌ వాటర్‌ను వదులుతున్నప్పుడు ఒక గంటపాటు కాలనీకి మంచినీటిని విడుదల చేస్తున్నారని కాలనీ వాసులు తెలిపారు. గతంలో విద్యుత్‌ నగర్‌లో ఏర్పాటు చేసిన బోరు నుంచి 24 గంటలు నీరు వదులుతున్నారని, ఈ బోరు నుంచి వచ్చే నీరు ఉప్పునీరని(జౌకులు) స్థానికులు తెలిపారు. ఆ నీటితో అన్నం చేసుకుంటే పచ్చగా అవుతుందని చెప్పారు. దీంతోపాటు ఆ బోరులో వచ్చేది ఉప్పు నీరు కాబట్టి తాగేందుకు కూడా వీలుకాకుండా ఇబ్బందిగా ఉందని, ఆ నీటితో స్నానాలు చేస్తే ఒళ్లంతా బంకగా ఉంటుందని వారు తెలిపారు. దీనిపై ఇటీవల సాక్షిలో 'మంచి నీరు ఇవ్వండి సారో' అనే కథనాన్ని ప్రచురించడం జరిగింది. దీనికి స్పందించిన మున్సిపల్‌ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేసి ప్రస్తుతం మున్సిపల్‌ వాటర్‌ వచ్చే సమయంలో ఒక గంటపాటు కాలనీకి నీటిని విడుదల చేస్తున్నారని స్థానికులు తెలిపారు. దీంతోపాటు మున్సిపల్‌ వాటర్‌ విడుదల చేసే సమయంలో నీళ్లు వస్తున్నాయనే సమాచారాన్ని కూడా తెలియజేస్తున్నారని తెలిపారు. ఇందుకు కాలనీ వాసులు సాక్షి పేపర్‌కు, మున్సిపల్‌ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు.

తెలుగుభాష అభ్యున్నతికి సమష్టి కృషి



తెలుగు ఉపాధ్యాయులను సన్మానించిన రచయితల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్‌ : తెలుగుభాష నేడు అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని, వాటన్నింటినీ అధిగమించి తెలుగుభాష అభ్యున్నతికి సమష్టిగా కృషి చేస్తామని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీన తెలుగుభాష దినోత్సవం, గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌(ఆర్‌యూపీపీ) కడప జిల్లా శాఖ ఆదివారం కడప సీపీ బ్రౌన్‌ పరిశోధన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సమావేశానికి పండిత పరిషత్‌ రాష్ట్ర కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో తెలుగుభాష సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి పద్మనాభయ్య మాట్లాడుతూ గిడుగు రామమూర్తి జయంతి అయిన ఆగస్టు 29వ తేదీని తెలుగుభాష దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం 2011లో నిర్ణయించిందని 2013 నుంచి ఏటా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ దేశీయ భాషల పరిరక్షణే ధ్యేయంగా 1927లో స్థాపించిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌ ఏటా తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోందన్నారు. విద్యార్థుల్లో తెగుగుభాష పట్ల మమకారాన్ని, పట్టును పెంపొందించేందుకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పాఠ్యపుస్తక రచయిత పైడి నాగసుబ్బయ్య మాట్లాడుతూ నేటి తెలుగు పాఠ్యపుస్తకాల్లో వచ్చిన మార్పులు, విద్యార్థుల్లో భాష, వ్యాకరణాల సామర్థ్యాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం 2024లో పదో తరగతిలో వందకు వంద మార్కులు సాధించిన ఉమ్మడి కడప జిల్లాకు చెందిన 20 మంది తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీ రాష్ట్ర బాధ్యులు గంగిరెడ్డి, రమణయ్య, వరప్రసాద్‌రెడ్డి, రమణమూర్తి, ఖాదర్‌బాసా, జిలాని, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, మైనుద్దీన్‌, పూర్వబాధ్యులు పర్వతుల్లా, రామకృష్ణారెడ్డి, పండితులు పాల్గొన్నారు.

రవీంద్రుని నాయకత్వంలో ఎస్సీలకు మేలు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్‌ కుమార్‌



రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీ విభాగం నాయకులు

కడప కార్పొరేషన్‌ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ వినోద్‌ కుమార్‌ అన్నారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో దళిత నాయకులు, కార్యకర్తలు రవీంద్రనాథ్‌రెడ్డికి శాలువాలు కప్పి, గజమాల వేసి, కేక్‌ కట్‌ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వినోద్‌ కుమార్‌ మాట్లాడుతూ రవీంద్రనాథ్‌రెడ్డి కార్యకర్తల కష్టాలు, నష్టాలు ఎరిగిన నాయకుడని, కష్టపడి పని చేసే వారికి తప్పక గుర్తింపు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, శ్యాంసన్‌, సంపత్‌, మేసా ప్రసాద్‌, భాస్కర్‌, బండి రమణ, అమృత్‌, సీకే దిన్నె నాయకులు శ్రీనివాసులు, చిన్న సుబ్బరాయుడు, సుబ్బన్న, మహిళా నేతలు రత్నకుమారి, బి.మరియలు, సుశీలమ్మ, తులశమ్మ, హైమవతి, పద్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో..

స్థానిక 23వ డివిజన్‌లో కార్పొరేటర్‌ తుంగా విజయలక్ష్మి, డివిజన్‌ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన రవీంద్రనాథ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆయనకు శాలువా కప్పి, గజమాల వేసి ఘనంగా సత్కరించారు. ఏపీ సోషల్‌ బోర్డు మాజీ ఛైర్మెన్‌ పులిసునీల్‌, నగరపాలక స్టాండింగ్‌ కౌన్సిల్‌ సుధాకర్‌ బాబ్జీ పాల్గొన్నారు.

యూపీఎస్‌ పథకం ఆమోదయోగ్యం కాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌. రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్‌ : కేంద్ర ప్రభుత్వం కేబినెట్‌ మీటింగ్‌లో కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ స్కీమ్‌ స్థానంలో యూనిఫైడ్‌ పెన్షన్‌ స్కీమ్‌ను తీసుకొని రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎస్‌టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌. రామాంజనేయులు అన్నారు. ఆదివారం కడప ఎస్‌టీఎఫ్‌ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగులు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నిన్న జరిగిన కేబినెట్‌ సమావేశంలో యూనిఫైడ్‌ పెన్షన్‌ స్కీమును తీసుకొని రావడం, ఆ విధానాన్ని ఉద్యోగులపైన రుద్దడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అందరూ జీతం నుంచి ఎటువంటి కోత లేకుండా రిటైర్డ్‌ అయ్యే సమయంలో పెన్షన్‌ కావాలని కోరుతున్నారన్నారు. ఉద్యోగుల జీతం నుంచి కాంట్రిబ్యూషన్‌ లేకుండా ఉండే పాత పెన్షన్‌ విధానాన్ని మాత్రమే ఉద్యోగులు కోరుతున్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు ఆలమూరు ప్రసాద్‌, శ్రీరామ్‌, సలాం, రవిశంకర్‌, విద్యాసాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనం చేయాలి

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టదలచిన యూపీఎస్‌ పింఛను పథకం ఉద్యోగులకు ఉపయోగకరమైనదా లేదా అనే విషయంపై లోతైన అధ్యయనం చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్‌ స్థానంలో యూనిఫైడ్‌ పెన్షన్‌ స్కీం తీసుకొస్తామని చెప్పడంపై ఉద్యోగులకు లబ్ధి చేకూర్చితేనే వారు స్వాగతిస్తారన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులు తమ కనీస హక్కు అయినటువంటి పింఛను కోసం పోరాటాలు చేస్తున్నారని, కావున ప్రభుత్వం వారికి పాత పెన్షన్‌ పథకం అందించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఎన్‌పీఎస్‌, యూపీఎస్‌ లాంటి పథకాలను ప్రవేశపెట్టే ముందు అవి పాత పింఛను పథకానికి సమానంగా లబ్ధి చేకూర్చితేనే అమలు చేయాలని సూచించారు. యూపీఎస్‌లో పాతికేళ్ల సర్వీసు ఉంటేనే సగం జీతం పింఛనుగా ఇస్తామని చెప్పడంపై పునరాలోచించాలన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఉద్యోగుల అభీష్టం మేరకు ఓపీఎస్‌ పునరుద్ధరించారని, మిగతా రాష్ట్రాల్లో కూడా ఒకే పింఛన్‌ విధానం అది కూడా ఓపీఎస్‌ విధానాన్నే అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఉద్యోగులకు మేలు చేకూరుతుందన్నారు.

ఓపీఎస్‌ కావాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుకుంటున్నది ఓపీఎస్‌ మాత్రమేనని, అది మాత్రమే కావాలని ఏపీటీఎఫ్‌ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్‌ సెక్రటరీ సీవీ ప్రసాద్‌ అన్నారు. కేంద్రం ఆమోదించిన యూనిఫైడ్‌ పెన్షన్స్‌ స్కీం(యూపీఎస్‌)పై ఆయన ఆదివారం వ్యాఖ్యానించారు. యూపీఎస్‌, జీపీఎస్‌లు ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కాదని తెలిపారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నగర శివారులోని 45వ డివిజన్‌ ఊటుకూరులోని శ్రీ కృష్ణా దేవాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రుక్మిణీ సత్యభామ సమేత రాధ కృష్ణుని కల్యాణం వైభవంగా నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

అమ్మాయిలపై దాడులు అరికట్టాలి

కడప ఎడ్యుకేషన్‌ : రాష్ట్రవ్యాప్తంగా అమ్మాయిలపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం కడపలోని ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహంలో ఆర్‌ఎస్‌యూ విద్యార్థి సంఘం మహిళా విభాగం కడప జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు దేశంలో అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. మన రాష్ట్రంలోని ముచ్చుమరి గ్రామంలో అభం శుభం తెలియని చిన్నారిపై అత్యాచారం చేసి శవం కూడా దొరకకుండా.. ఆమె తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మేలు చేసేలా ప్రభుత్వ ఉత్తర్వులు

కడప కార్పొరేషన్‌ : బదిలీల్లో ఉద్యోగులకు మేలు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సంతోషదాయకమని ఆంధ్రప్రదేశ్‌ స్వాబ్‌ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ స్టేట్‌ సెక్రటరీ సురేష్‌, నాయకులు శ్రీనివాసులు, నాగరాజు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం సాధారణ బదిలీలకు ఈనెల 19 నుంచి 31 వరకు గ్రీన్‌ సిగ్నల్‌ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో ముఖ్యంగా భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే వారిద్దరికీ ఒకే స్టేషన్లో లేదా ఒకరికొకరు దగ్గరగా ఉన్న స్టేషన్లో పోస్టింగ్‌ చేయమని ప్రాధాన్యత ఇవ్వాలని మార్గదర్శకాలను స్పష్టంగా జారీ చేశారన్నారు.

'ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి'

కడప ఎడ్యుకేషన్‌ : కడప, అన్నమయ్య జిల్లాల్లో పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు అవినీతికి పాల్పడిన అధికారులపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌.కె.జునైద్‌ బాషా డిమాండ్‌ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ రాయసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి

కడప కల్చరల్‌ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. నగరానికి చెందిన అఖిల్‌ అకాడమి చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. శిల్పారామాల రాష్ట్ర పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.


న్యాయం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు తగిన న్యాయం చేయాలని ఆర్టీసీ రిటైర్డ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ సెక్రటరీ రఘునాథరెడ్డి కోరారు. కేంద్ర మంత్రి ఓ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన వారికి మాత్రమే పెన్షన్‌ స్కీమ్‌ వర్తిస్తుందని, ప్రైవేటు రంగలో పని చేసే కార్మికులకు పెన్షన్‌ సౌకర్యం లేదని చెప్పడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దీంతో తమ ఆశలు రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉన్నాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు జరిగేలా చూడాలని కోరారు.


ప్రకృతి సోయగం.. పర్యాటకుల పరవశం



ఈ దృశ్యాలు చూడడానికి రెండు కళ్లు సరిపోవడం లేదు కదూ.. ఇంతటి పచ్చదనం చూసి కోనసీమ అనుకునేరు. ఆధ్యాత్మిక కేంద్రమైన గండిక్షేత్రం సమీపంలో ప్రకృతి అందాలు జనాలను మైమరిపిస్తున్నాయి. రైతులు వరి సాగు చేయగా పైరు పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చని పొలం గట్లతో ప్రకృతి అందాలు అదరహో అనిపిస్తున్నాయి. ఈ అందాలను చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. చేలు భూమాతకు పచ్చని చీర కట్టినట్టుగా ఉంది. శ్రావణమాసం కావడంతో గండి క్షేత్రానికి వచ్చే భక్తులు కొద్ది సేపు ఆగి పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు. – కడప ఎడ్యుకేషన్‌



గుడిపక్కనే ఉన్న ఎత్తయిన కొండ శిఖరం



పచ్చటిపైరు మధ్యలో కనివిందు చేస్తున్న వృక్షం